## కలకత్తా ఘటనపై నిరసన



కురబలకోట: కలకత్తా జూనియర్ డాక్టర్ హత్యాచార ఘటనకు నిరసనగా మండలంలోని డాక్టర్లు, సిబ్బంది ఆందోళన నిర్వహించారు. నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. ప్రజల ప్రాణాలు కాపాడే వైద్యులకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

### వైద్యులపై దాడులు హేయమైనచర్య



కుల,మత, వర్గాలకు అతీతంగా ఎవ్వరు ఆసుపత్రికి వచ్చిన ప్రతి ఒక్కరి ప్రాణాలు కాపాడటానికి వైద్యులు కృషి చేస్తారు. అలాంటి పవిత్రమైన వృత్తిని ఎంచుకున్న యువతిని పాశవికంగా హత్యచేయడం దుర్మార్గం. వైద్యులపై కానీ, వైద్యబృందిపై దాడులను పూర్తిగా నియంత్రించాలి. దాడులకు పాలపడిన వారిని ఖఠినంగా శిక్షించాలి.

– డాక్టర్. వై.పవన్‌కుమార్, పీలేరు




### ఇది తలదించుకునే సంఘటన



కలకత్తా మహిళా డాక్టర్‌పై జరిగిన సంఘటన దారుణం. యావద్దేశాన్ని కుదిపేసింది. సభ్య సమాజాన్ని కలచివేసింది. ఇది సమాజంలో తలదించుకునే సంఘటన. ప్రజల ప్రాణాలు కాపాడే డాక్టర్లు రోడ్లు పైకి రావాల్సి రావడం విచారకరం. వైద్యులపై దాడులు జరక్కుండా చూడాలి. ఆసుపత్రుల్లో పనిచేసే వారికి తగిన రక్షణ కల్పించాలి.

– శ్రీధర్, మండల వైద్యాధికారి, కురబలకోట



### డాక్టర్లకు రక్షణ కల్పించాలి



దేశవ్యాప్తంగా డాక్టర్లకు ప్రభుత్వాలు రక్షణ కల్పించాలి. అనారోగ్యంతో, ప్రమాద సమయాల్లో ఆస్పత్రులకు వచ్చిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించి ప్రాణాలు కాపాడే డాక్టర్లకే రక్షణ లేకపోవడం బాధాకరం. కలకత్తాలో జరిగిన సంఘటనలో నిందితులను ఉరి తీయాలి. ఆస్పత్రుల్లో అన్ని రకాల రక్షణ చర్యలు చేపట్టాలి.

– డాక్టర్ ఆకాలత, తంబళ్లపల్లె

## క్లుప్తంగా

### గోకులాలకు దరఖాస్తులు చేసుకోండి

వాల్మీకిపురం : గోకులాలకు దరఖాస్తు చేసుకోవాలని వాల్మీకిపురం ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ నీరజ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పశువుల షెడ్లు నిర్మించుకోవచ్చునని తెలిపారు. వాల్మీకిపురం మండలానికి 25 యూనిట్లు, గుర్రంకొండ మండలానికి 50 యూనిట్లు మంజూరు అయ్యాయన్నారు. ఇందులో ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, కోళ్ల షెడ్లు ఏర్పాటు చేసుకోవచ్చునన్నారు. ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఉపాధి హామీ జాబ్ కార్డు, బ్యాంక్ పాసుపుస్తకం, భూమి పాసు పుస్తకం, కుల ధృవీకరణ పత్రంతో స్థానిక రైతు సేవా కేంద్రంలో గానీ, పశువైద్య కేంద్రంలో గానీ సంప్రదించాలని ఆమె సూచించారు.

### విద్యార్థులకు ఉచితంగా పెరుగు

కలకడ : మండలంలోని కలకడ ఆదర్శ పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన సమయంలో రోజు 20 లీటర్లు పెరుగును ఉచితంగా అందించనున్నట్లు రాతిగుంటపల్లె సర్పంచ్ అలివేలమ్మ ప్రకటించారు. శుక్రవారం స్థానిక ఆదర్శ పాఠశాలలో ఆ పాఠశాల చైర్మన్ రమేష్ నాయుడు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ముఖ్యఅతిథి గాపాల్గొని విద్యార్థులకు తన వంతు సహాయం చేస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మల్లంషావలి, వైస్ చైర్‌పర్సన్ రిజ్వానఅక్బర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### పోలీస్‌స్టేషన్ తనిఖీ

పెద్దతిప్పసముద్రం : ములకలచెరువు సర్కిల్‌కు నూతనంగా నియమితులైన సీఐ రాజా రమేష్ శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎస్‌ఐతో పాటు పలువురు డిప్యూటి సీఎం పవన్ కళ్యాణ్ బందోబస్తుకు వెళ్లడంతో సీఐ స్టేషన్‌లో ఉన్న సిబ్బందితో మాట్లాడారు. మండల స్థితిగతులు, నమోదైన కేసులు, పెండింగ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు.

### గంగమ్మకు ప్రత్యేక పూజలు

మదనపల్లె సిటీ : శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని స్థానిక కోర్టు ఆవరణంలోని గంగమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.మహిళలు నిమ్మకాయల్లో ఒత్తులతో దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. స్థానిక చిప్పిలిలోని శ్రీ సత్యనారాయణస్వామి ఆలయంలో శ్రావణ శుక్రవారం పూజలు నిర్వహించారు. బెంగుళూరు రోడ్డులోని యోగభోగేశ్వరస్వామి ఆలయం, దేవళంవీధిలోని సోమేశ్వరస్వామి ఆలయాల్లో అమ్మవారికి పూజలు చేశారు.

### లోకాయుక్తకు ఘన స్వాగతం

పెద్దతిప్పసముద్రం : రాష్ట్ర లోకాయుక్త జస్టిస్ పీ.లక్ష్మణరెడ్డి మండలంలోని టి.సదుం పంచాయతీలోని స్వగ్రామమైన చెన్నరాయునిపల్లికి విచ్చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం తహసీల్దార్ శ్రీరాములు నాయక్, ఏఎంసీ మాజీ చైర్మన్ పీ.శ్రీనాథ్‌రెడ్డి, మండల ఆర్‌ఐ అనీషా, వీఆర్వో ఖాదర్ బాషాలు లోకాయుక్తకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో ఘనంగా సత్కరించారు.

### చలిమామిడివారిపల్లిలో అడిషనల్ సీసీఎల్‌ఏ

పెద్దతిప్పసముద్రం : మండలంలోని పులికల్లు పంచాయతీ చలిమామిడివారిపల్లికి శుక్రవారం సాయంత్రం అడిషనల్ చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేటివ్ (అడిషనల్ సీసీఎల్‌ఏ) అధికారి ప్రభాకర్‌రెడ్డి విచ్చేశారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ శ్రీరాములు నాయక్, డీటీ విద్యాసాగర్, వీఆర్వో షంషాద్‌లు అడిషనల్ సీసీఎల్‌ఏను మర్యాద పూర్వకంగా కలిశారు. విధి నిర్వహణలో భాగంగా బి.కొత్తకోట మండలం హార్సిలీహిల్స్‌కు వెళుతూ మార్గమధ్యంలోని చలిమామిడివారిపల్లిలో ఉన్న సమీప బంధువు రంగారెడ్డి ఇంటికి అడిషనల్ సీసీఎల్‌ఏ వచ్చి వెళ్ళినట్లు రెవెన్యూ అధికారులు పేర్కొన్నారు.

### గాలికుంటు వ్యాధికి టీకాలు

తంబళ్లపల్లె : పాడి రైతులు గాలికుంటు వ్యాధి నివారణకు పశువులకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని జిల్లా పశుసంవర్ధకశాఖ జేడీ గుణశేఖర్‌పిళ్లై తెలిపారు. శుక్రవారం ఆయన పలు గ్రామసభల్లో పాల్గొన్నారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ జిల్లాకు 3.45 లక్షల టీకాలు వచ్చినట్లు తెలిపారు. 21, 22 తేదీల్లో 27 వేల పశువులకు టీకాలు వేయడం జరిగిందన్నారు. కార్యక్రమం సెప్టెంబర్ 18 వతేదీ వరకు కొనసాగుతుందన్నారు.

### యువత రక్తదానం చేయాలి

మదనపల్లె సిటీ : రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీ డైరెక్టర్ ఎస్.రామలింగారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక చిత్తూరు రోడ్డులోని ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజీలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు.

# గ్రామాభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యం

- స్వర్ణ గ్రామపంచాయతీ పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు
- వంద రోజులు పని కల్పించడమే ధ్యేయం
- గ్రామసభల్లో టీడీపీ నాయకుల హంగామా
- అభివృద్ధికి సహకరిస్తామన్నా ఉనికి కోసం ఆరాటం



కేవీపల్లె : మాట్లాడుతున్న ఈవోపీఆర్డీ గఫూర్



రామసముద్రం: తిరుమలరెడ్డిపల్లిలో గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ నిర్మలాదేవి



వాల్మీకిపురం : మాట్లాడుతున్న ఎంపీడీఓ మనోహర రాజు



మదనపల్లె: అంకిశెట్టిపల్లె గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ ఖాజాబి



పీలేరు : మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి



నిమ్మనపల్లె : గ్రామసభలో మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి ప్రసాద్



పెద్దతిప్పసముద్రం : బూర్లపల్లిలో పంచాయతీ కార్యదర్శిని ప్రశ్నిస్తున్న ప్రజలు

మదనపల్లె : గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశాభివృద్ధి సాధ్యమని, గ్రామాభివృద్ధికి ఏం చేయాలన్న విషయమై స్వర్ణ గ్రామపంచాయతీ పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేందుకు అన్ని పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ భానుప్రసాద్, తహసీల్దార్ ఖాజాబీ అన్నారు. శుక్రవారం మండలంలోని 25 పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా స్వర్ణగ్రామ పంచాయతీ, ఎన్ఆర్ఈజీఎస్‌కు సంబంధించిన రెండు అంశాలపై గ్రామసభలో చర్చించారు. ప్రజల వ్యక్తిగత అవసరాలైన తాగునీరు, పారిశుధ్యం, వీధిలైట్లు, కమ్యూనిటీ అవసరాలైన రోడ్లు, డ్రైయిన్లు, చెరువుల పునరుద్ధరణ, ఎన్ఆర్ఈజీఎస్ పనులకు సంబంధించి అన్ని గ్రామపంచాయతీల్లో తీర్మానాలు చేశారు. పంచాయతీలు, సర్పంచుల వ్యవస్థ బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, అందులో భాగంగానే ప్రజావసరాలను గుర్తించేందుకు గ్రామసభలు ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. స్వర్ణ గ్రామ పంచాయతీ కార్యక్రమంలో భాగంగా చేపట్టే పనుల ద్వారా గ్రామాల్లో మౌలికవసతులు పెరుగుతాయన్నారు. పంచాయతీలకు ఆర్థిక పరిపుష్టి కలిగించి వ్యవస్థకు జీవం పోయాలన్నదే గ్రామసభల ప్రధాన ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీలు, రెవెన్యూ, పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**ఉనికి కోసం టీడీపీ ఆరాటం :**

ప్రభుత్వ పథకాల అమలుకు, కార్యక్రమాల నిర్వహణకు తోడ్పాటునందిస్తామని చెప్పినప్పటికీ కొన్నిచోట్ల టీడీపీ నాయకులు రాద్ధాంతం చేశారు. మండలంలోని కోళ్లబైలు–1, 2 పంచాయతీల్లో వైఎస్సార్ సీపీ సర్పంచ్‌లు ఆనందరెడ్డి, బండి శశికళలు గ్రామాభివృద్ధికి సహకరిస్తామని చెప్పినప్పటికీ, టీడీపీ నాయకులు ఉద్దేశపూర్వకంగా సభలో రాద్ధాంతం చేశారు.

**గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలి**

నిమ్మనపల్లె : గ్రామాల అభివృద్ధి ధ్యేయంగా నాయకులు ప్రజా ప్రతినిధులు ప్రజల సహకారంతో పని చేయాలని మండల ప్రత్యేక అధికారి కే.ప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలంలోని 10 గ్రామ పంచాయతీలలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా, గ్రామాల అభివద్ధికి ప్రణాళికలు రూపొందించేందుకు గ్రామ సభలు ఆయా సర్పంచ్‌ల అధ్యక్షతన నిర్వహించారు. రాచవేటివారిపల్లె, రెడ్డివారిపల్లె లో జరిగిన గ్రామ సభలకు మండల ప్రత్యేక అధికారి ప్రసాద్ హాజరయ్యారు. కార్యక్రమంలో సర్పంచులు సుబ్రహ్మణ్యం,రెడ్డమ్మ,తహసీల్దార్ ధనంజయలు, ఎంపీడీవో రమేష్ బాబు, ఏపీఓ రమేష్, ఏవో మురళీమోహన్, ఎంఈఓలు నారాయణ, పద్మావతి, ఆర్డబ్ల్యుసిఎఈ రెడ్డి రాణి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

**ప్రభుత్వ పథకాలు అర్హులకే అందాలి**

తంబళ్లపల్లె : ప్రభుత్వం అమలు చేసే పథకాలు అర్హులకే అందించే విధంగా చూడాలని ఎంపీడీఓ సురేంద్రనాథ్ తెలిపారు. శుక్రవారం మండలంలోని 21 పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. ప్రభుత్వ పథకాలు గురించి వివరించారు. సభల్లో పశుసంవర్ధకశాఖ జెడి గుణశేఖర్‌పిళ్లై, మండల స్థాయి అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

**సమస్యల పరిష్కారానికే..**

వాల్మీకిపురం : మండలంలోని 16 పంచాయతీల్లో స్వర్ణ గ్రామ పంచాయతీ గ్రామ సభలను సర్పంచ్‌ల ఆధ్వర్యంలో పండగ వాతావరణంలో నిర్వహించినట్లు ఎంపీడీఓ మనోహర రాజు తెలిపారు. శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో స్వర్ణ గ్రామ పంచాయతీ గ్రామసభలో ఎంపీడీఓ మాట్లాడుతూ..ప్రజల ఉమ్మడి అవసరాలను తీర్చేందుకు గ్రామ సభలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఆర్ డబ్ల్యూఎస్ డిప్యూటీ ఇంజనీర్ శివ మోహన్, తహశీల్దార్ పామిలేటి, ఈవో ఉదయ్ కుమార్, సర్పంచ్ గంగులమ్మ, ఉపసర్పంచ్ కేశవ రెడ్డి, టీడీపీ నాయకులు మల్లికార్జున రెడ్డి, గాంధీపేట రమణ, రాజేంద్రాచారి తదితరులు పాల్గొన్నారు.

**కలకడలో..**

కలకడ : గ్రామీణ జీవన పరిస్థితులు మెరుగు పరచడానికే గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని అన్ని పంచాయతీల సర్పంచ్‌ల అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించారు. గ్రామాలలో ఉపాధి హామీ అజెండాతో పాటు తాగునీరు, సిమెంట్ రోడ్లు, మౌళిక వసతుల కల్పన, డ్రైనేజీ, వీధి దీపాలు తదిఅంశాలతో పాటు అభివృద్ధి ప్రణాళికలపై చర్చించారు. కోన గ్రామంలో సర్పంచ్ జల్లా రాజగోపాల్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు కుమారి, స్వర్ణలత, శ్రీనివాసులురెడ్డి, కాంతరావ్ పాల్గొన్నారు.

**గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలి**

గుర్రంకొండ : ఉపాధిహామీ పనులతో గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని ఎంపీడీఓ వెంకటేశులు అన్నారు. శుక్రవారం మండలంలోని 15 గ్రామ పంచాయతీలలో గ్రామసభలు నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద ఏఏ పనులు చేపట్టాలో తీర్మానించారు. ప్రజల నుంచి వివిధ రకాల సమస్యలపై అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంఈవోలు సురేంద్రబాబు, సుబ్రమణ్యం, ఎఈలు లాల్‌స్వామి, జావీద్, మౌసిన్, సర్పంచ్‌లు రౌనఖ్‌భాషా, మంగళంబ, లలితమ్మ, ఆనంద, నందినీలు పాల్గొన్నారు.

**పీలేరును అభివృద్ధి పథంలో నడిపిస్తాం**

పీలేరు : పీలేరు మండలాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి పథంలో నడిపిస్తామని ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో స్వర్ణ గ్రామ పంచాయతీ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024–25వ సంవత్సరానికి గానూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 46 రకాల పనులు కల్పించినట్లు తెలిపారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలకు పీలేరును మున్సిపాలిటీ చేస్తామన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి కుంటుపడిందని చెప్పారు. త్వరలోనే పీలేరులో అన్ని వీధుల్లో పర్యటించి తాగునీరు, పారిశుద్యం, రోడ్లు, వీధి దీపాలు తదితర సమస్యలు గుర్తించి పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి ప్రసన్నకుమారి, తహసీల్దార్ భీమేశ్వర్‌రావు, ఎంపీడీఓ ఉపేంద్రరెడ్డి, ఈవో గురుమోహన్, టీడీపీ నాయకులు కోటపల్లె బాబురెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, అమరనాథరెడ్డి, రామ్మూర్తి, చాపల సూరి, కంచి సూరి, వసంతాల రాజ తదితరులు పాల్గొన్నారు.

**సమస్యలు పరిష్కరించండి**

పెద్దమండ్యం : గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ప్రజలు గ్రామసభల్లో ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. మండలంలోని 17 గ్రామ పంచాయతీలలో శుక్రవారం ప్రత్యేక గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక గ్రామసభల ఆవశ్యకతపై అధికారులు వివరించారు. ఉపాధి హామీ ద్వారా చేపట్టేపనుల గురించి ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీధర్ రావు, సర్పంచ్‌లు మొలక బయ్యారెడ్డి, ఎస్ బాబా, జింకా విశ్వనాథ, పి భారతి, సి సరస్వతి, టి జయమ్మ, పీరాన్‌బి, విశ్వనాథరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు జనార్ధన్, పి జగన్‌మోహన్, శైలజ, ఖాదర్ భాషా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**బూర్లపల్లి, కమ్మచెరువులో గ్రామసభ రసాభస**

పెద్దతిప్పసముద్రం : రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివద్ధి శాఖ కమిషనర్ ఉత్తర్వుల శుక్రవారం ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో నిర్వహించిన స్వర్ణ గ్రామసభల్లో ప్రజా సమస్యలు వెల్లువెత్తాయి. సిమెంటు రోడ్లు, మురికి కాలువలు, వీధి దీపాలు,విద్యుత్ సమస్యలపైనే ప్రజలు అధికంగా సభా దష్టికి తీసుకొచ్చారు. మండలంలో రెండు గ్రామాలు మినహా మిగిలిన పంచాయతీల్లో గ్రామసభలు సజావుగా సాగాయి. బూర్లపల్లిలో జరిగిన గ్రామసభలో పలువురు పంచాయతీ కార్యదర్శి మహబూబ్‌బాషా ఏకపక్ష ధోరణిగా అవలంభించారని ఆరోపిస్తూ అతనితో పాటు సర్పంచ్ సుబ్బిరెడ్డిపై మండి పడ్డారు. అలాగే కమ్మచెరువు గ్రామసభలో గొర్ల శ్రీనివాసులు రెడ్డి అనే వ్యక్తి మాట్లాడుతూ ఈ పంచాయతీలో గత రెండు నెలలుగా ఉపాధి హామీ పథకం ద్వారా ఎక్కడెక్కడ ఎలాంటి పనులు చేసారో మస్టర్ ఐడీ నంబర్‌తో సహా సభలో బహిర్గతం చేయాలని చెప్పడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. అనంతరం ఉపాధి హామీ ద్వారా చేపడుతున్న పనులు, రాయితీ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి 2024–2025 ఆర్థిక సంవత్సరంలో చేపట్టబోవు పనుల ప్రణాళికను రూపొందించారు. స్పెషలాఫీసర్ పీఆర్ డీఈ విజయ్ మోహన్, ఎంపీడీఓ కేఎన్ శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీరాములు నాయక్, జేఈలు హరి, ఉత్తన్న, నిరంజన్‌లు గ్రామసభలను పర్యవేక్షించారు.

**గ్రామ సభలలో వినతుల వెల్లువ**

కలికిరి : మండల వ్యాప్తంగా 14 గ్రామ పంచాయతీలలో శుక్రవారం జరిగిన గ్రామ సభలలో ప్రజల నుంచి పెద్ద ఎత్తున వినతలు వెల్లువెత్తాయి. అన్ని గ్రామ పంచాయతీలలో సుమారు 4వేలకు పైగా ఉపాధి హామీ, ఇతర అభివృద్ధి పనులకు సంబంధించి, 150కి పైగా పలు రకాల సమస్యలకు సంబంధించి వినతులు వచ్చినట్లు ఎంపీడీఓ గంగయ్య తెలిపారు. ఆయా శాఖల వారిగా వేరుచేసిన తరువాత అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయడం జరుగుతుందని, అలాగే సమస్యలపై వచ్చిన వినతులను పరిష్కరించనున్నట్లు ఆయన తెలిపారు.

**ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలి**

కేవీపల్లె : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు సద్వినియోగం చేసుకోవాలని ఈవోపీఆర్డీ గఫూర్, ఏపీవో నాగరాజ అన్నారు. శుక్రవారం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో ×మన పంచాయతీ.. మన సాధికారిత× గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024–25 సంవత్సరంలో ఉపాధిహామీ పథకంలో ప్రజలకు అవసరమైన పనులు కల్పించనున్నట్లు తెలిపారు. గ్రామ పంచాయతీలో నమోదు చేసుకున్న ప్రతి కుటుంబానికి వంద రోజుల వేతన ఉపాధి కల్పిస్తామన్నారు. స్త్రీ, పురుషులకు సమాన వేతనం ఉంటుందని తెలిపారు. నీటి సంరక్షణ పనులు, మౌలిక సదుపాయల కల్పన పనులు, వ్యక్తిగత లబ్ధి చేకూర్చే పనులు చేసుకోవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం చంద్రకళ, గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

**రామసముద్రంలో..**

రామసముద్రం : ఉపాధిహామి పథకం కింద చేపట్టనున్న వివిధ పనుల కోసం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాలలో శుక్రవారం సర్పంచ్‌ల అధ్యక్షతన గ్రామ సభలు నిర్వహించారు. సభల్లో గ్రామస్తుల నుంచి అధిక సంఖ్యలో వినతులు వచ్చాయి. వీటిలో ఎక్కువగా గ్రామ మౌలిక సదుపాయాలైన సిసి రోడ్లు, మురికికాలువ నిర్మాణాలు, పశుపోషణ షెడ్లకు సంబంధించి అధికంగా వినతులు వచ్చాయి. అలాగే నీటి సంరక్షణ పనులు , వ్యక్తి గత లబ్ధినిచ్చే పనులు, వ్యవసాయ అనుబంధ పనుల కోసం గ్రామస్తులు దరఖాస్తు చేసుకున్నారు. గ్రామసభలను తహసీల్దార్ నిర్మలాదేవి పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఎంపీపీ కుసుమకుమారి, వైస్ ఎంపీపీ రమణారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది , సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## కామ్రేడ్ హైదర్‌ఖాన్ మృతి తీరనిలోటు

మదనపల్లె : సీనియర్ కమ్యూనిస్ట్ నాయకులు, కార్మికనేత హైదర్‌ఖాన్(83) మృతి తీరనిలోటని కమ్యూనిస్టు నాయకులు పేర్కొన్నారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. 18 ఏళ్ల వయస్సులోనే ఆయన కమ్యూనిస్ట్ భావజాలానికి, పోరాట, ఉద్యమాలకు ఆకర్షితుడై కార్యకర్త స్థాయి నుంచి నాయకుడిగా ఎదిగారు. ఆర్టీసీలో గ్యారేజి మెకానిక్‌గా 30 సంవత్సరాలు విధులు నిర్వహించిన ఆయన ఉద్యోగ సమయంలోనూ కార్మికుల సమస్యలపై తనదైన శైలిలో ఉద్యమించారు. పదవీవిరమణ అనంతరం పూర్తిగా కమ్యూనిస్ట్ ఆదర్శాలకు అంకితమయ్యారు. మదనపల్లె తొలి ఎమ్మెల్యే, కమ్యూనిస్ట్ నాయకులైన దొడ్డా సీతారామయ్యకు ప్రధాన అనుచరుడిగా గుర్తింపు పొందారు. పేద కుటుంబం నేపథ్యమైనప్పటికీ ప్రజా సమస్యల పరిష్కారానికి ఎర్రజెండానే సరైన మార్గం అని నమ్మి చివరివరకు అందులోనే కొనసాగారు. కామ్రేడ్ హైదర్‌ఖాన్‌కు భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. తుదిశ్వాస వరకు కమ్యూనిస్ట్ నాయకుడిగానే జీవితాన్ని గడిపిన హైదర్‌ఖాన్, తర్వాతి తరం కమ్యూనిస్టులకు ఆదర్శ నాయకుడిగా స్ఫూర్తి నింపారు. హైదర్‌ఖాన్ మరణవార్త తెలిసిన వెంటనే కమ్యూనిస్టు, ప్రజాసంఘాల నాయకులు పలువురు రామకృష్ణవీధిలోని ఆయన స్వగృహానికి విచ్చేసి భౌతికకాయానికి నివాళులర్పించారు.



హైదర్‌ఖాన్ భౌతికకాయంపై ఎర్రజెండా కప్పిన సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు

## టూ టౌన్ సీఐకి సత్కారం

మదనపల్లె : మదనపల్లె టూ టౌన్ సీఐ కె. రామచంద్రను పట్టణ లాడ్జిల యజమానుల అసోసియేషన్ అధ్యక్షులు భాస్కర్, సెక్రటరీ వి సుధాకర్ రెడ్డి సభ్యులతో కలిసి సన్మానించారు. శుక్రవారం టూ టౌన్‌సీఐ కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ లాడ్జిల యజమానులు శాంతి భద్రతల దృష్ట్యా నియమ నిబంధనలు తప్పకుండా పాటించాలన్నారు. అనుమానిత వ్యక్తులు లాడ్జిలలో బస చేసినప్పుడు గోప్యంగా తమకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు రాజ్ భవన్ రాజా, ప్రసన్నకుమార్,తదితరులు పాల్గొన్నారు.



సీఐని సత్కరిస్తున్న లాడ్జిల అసోసియేషన్ సభ్యులు

## బడి బస్సులు నిబంధనలమేరకే నడపాలి

మదనపల్లె : పాఠశాలల బస్సులు ప్రభుత్వ రవాణాశాఖ నిబంధనల మేరకే నడపాలని, విద్యార్థుల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఎంవీఐలు దినేష్‌చంద్ర, శివలింగయ్య, శ్రీహరి తెలిపారు. శుక్రవారం ఎంవీఐ కార్యాలయంలో మదనపల్లె డివిజన్‌లోని ప్రైవేట్ స్కూల్స్, కాలేజ్ యాజమాన్యాలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. స్కూల్, కాలేజీ బస్సుల నిర్వహణ, భద్రతాప్రమాణాలపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎంవీఐలు మాట్లాడుతూ... బడి బస్సులు నడిపే డ్రైవర్లు అనుభవజ్ఞులై, ఓపిక కలిగి ఉండాలన్నారు. పిల్లలను తరలించేందుకు మంచి కండిషన్‌లో ఉన్న వాహనాలనే ఉపయోగించాలని, వాహనాన్ని ఎప్పటికప్పుడు రిపేరీలు చేయిస్తూ, ఎలాంటి సమస్యలు లేకుండా చూసుకోవాలన్నారు. ఫిట్‌నెస్ కోసం వచ్చినప్పుడు ఆన్‌లైన్‌లో దరఖాస్తులో పేర్కొన్న డ్రైవర్‌తోనే వాహనాన్ని నడిపించాలన్నారు. సీట్ల పరిమితి పేర్కొన్న మేరకే ఏర్పాటు చేయాలన్నారు. ఓవర్‌లోడ్ వేసుకుని వస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుకూలంగా వాహనంలో మెడికల్ కిట్లు, గాలి, వెలుతురు వచ్చేలా కిటికీలు, సీట్ల మధ్య రాడ్లు అమర్చి ఉండాలన్నారు. విద్యార్థులు బస్సులో ఎక్కేందుకు, దిగేందుకు అనుకూలంగా 325 మిల్లీమీటర్ల, ఎత్తు ఉండేలా బస్సు మెట్లు ఉండాలన్నారు. ఆపద సమయంలో బయటకు దిగేందుకు అత్యవసర ద్వారం తప్పకుండా ఏర్పాటుచేయాలన్నారు. వాహనం టైర్లు, బ్రేకులు నాణ్యతతో ఉండేలా చూసుకోవాలన్నారు.



మాట్లాడుతున్న ఎంవీఐ దినేష్‌చంద్ర, శివలింగయ్య, శ్రీహరి తదితరులు

## ఘనంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం



మదనపల్లె రాకెట్ నమూనాలతో జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు

మదనపల్లె సిటీ : జాతీయ అంతరిక్ష దినోత్సవం పురస్కరించుకుని స్థానిక బసినికొండ జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉపగ్రహ నమూనా ,రాకెట్ నమూనాల ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులచే ర్యాలీ చేశారు. ఇన్‌స్పైర్ డివిజన్ ఇన్‌చార్జ్ భాస్కరన్ మాట్లాడుతూ చంద్రయాన్ 3 ఘన విజయం సాధించిన సందర్భంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. ప్రపంచ అంతరిక్ష చరిత్రలో భారత్ ఒక సువర్ణ అధ్యాయాన్ని లిఖించిందన్నారు. హెచ్ఎం శ్రీనివాసులు చంద్రయాన్ 3 విజయాన్ని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆదిలక్ష్మి, పద్మావతి, శివశంకర్, రామచంద్ర, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

**విద్యార్థులకు బహుమతులు**

జాతీయ అంతరిక్ష దినోత్సవం పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వక్తృత్వ పోటీలు,వ్యాస,చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థుల్లో శాస్త్ర, సాంకేతిక విజ్ఞానాభివృద్ధిని పెంపొందించుకోవాల్సిన ఆవశ్యకతను భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు శివప్రసాద్, రెడ్డమ్మ తెలిపారు. హెచ్ఎం జనార్ధన్‌రెడ్డి, ఉపాధ్యాయులు అమరనాథరెడ్డి, సుమకిరణ్, ఉమారాణి పాల్గొన్నారు.


**వాల్మీకిపురంలో..**

వాల్మీకిపురం : స్థానిక పివిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం సావిత్రి మాట్లాడుతూ 2023 ఆగస్టు 23న చంద్రునిపై చంద్రయాన్ –3 విజయవంతంగా ల్యాండింగ్ అయిన మధుర క్షణాలను ప్రతి భారతీయుడు గుండెల్లో నింపుకోవాలన్నారు. ఉపాధ్యాయులు రమణప్ప, భాస్కర్ నాయక్, నాగేశ్వర, ఖదీర్‌బాషా, చంద్రశేఖర్, దుర్వాసులు నాయుడు, రవీంద్ర రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, మహబూబ్ ఖాన్ పాల్గొన్నారు.

## తెలుగుజాతి ఆణిముత్యం టంగుటూరి



పీలేరు: టంగుటూరి జయంతి కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు



వాల్మీకిపురం: ప్రకాశం పంతులు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు



మదనపల్లె : ప్రకాశం చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

పీలేరు రూరల్ : తెలుగుజాతి ఆణిముత్యం టంగుటూరి ప్రకాశం పంతులు అని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ నటరాజ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోటంగుటూరి 152వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టంగుటూరి న్యాయవాదిగా, రాజకీయ నాయకుడిగా, సంఘ సంస్కర్తగా ఆంగ్లేయులకు వ్యతిరేకంగా పోరాడిన వ్యక్తిగా తెలుగు జాతికి లభించిన ఆణిముత్యమని కొనియాడారు. విద్యార్థులు ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు యర్రయ్య, రాజన్న, మునివెంకటయ్య, శశిదేవి, లీలావతి, లక్ష్మీదేవి, మురళి, కిషోర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ఘనంగా టంగుటూరి జయంతి**

వాల్మీకిపురం : ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను శుక్రవారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాల ప్లస్‌లో టంగుటూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక అధ్యక్షులు ప్రభుచరణ్ మాట్లాడుతూ 1921లో న్యాయవాద వృత్తిని విడిచిపెట్టి గాంధీ పిలుపు మేరకు భారత జాతీయ ఉద్యమంలోకి ప్రవేశించారన్నారు.1928 ఫిబ్రవరి 3న చెన్నైలో జరిగిన ఉద్యమంలో పోలీసులకు గుండెలు చూపుతూ ధైర్యం ఉంటే కాల్చండి అని సవాల్ చెయ్యగా ఆయన మాటలకు పోలీసులు కూడా వెనక్కి తగ్గారన్నారు. ఆనాటి సంఘటన టంగుటూరికి ఆంధ్రకేసరి అన్న బిరుదును తెచ్చి పెట్టిందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులు పుష్పలత, శోభారాణి, నాగసునీత, షబ్బీర్, వసుంధర, నాగేశ్వర, రేణుక, శోభ, వేదవాణి, రాధ, విద్యార్థులు పాల్గొన్నారు.

**ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీలో..**

మదనపల్లె సిటీ : స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీలో శుక్రవారం మొదటి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశంపంతుల జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రిన్సిపాల్ బాలకృష్ణమూర్తి మాట్లాడుతూ నిస్వార్థ దేశసేవ ఎప్పటికి మరవలేమన్నారు. తన జీవిమంతా ప్రజాసేవకు అంకితం చేశారన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.